

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

(గత సంచిక తరువాయి)

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లోకి పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'. ఇది మళ్లీ రెండు భాగాలు. అవేమిటో అప్పుడు చూద్దాం. ఈ అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# మొదటి భాగం: పీజీ టు కేజీ

**అక్కడ అతను** సుమారు నాలుగు రోజులున్నాడు. బిల్లు నాలుగు వందల మార్కులకు పైనయ్యింది. అదృష్టమేమిటంటే మేము జర్మనీలో అడుగు పెట్టిన క్షణంనుంచీ – డాడ్ వారు మాకు హెల్త్ఇన్సూరెన్సు తీసుకున్నారు. అందువల్ల ఆ ఖర్చు మొత్తం ఇన్సూరెన్స్ కంపెనీ భరించింది. ఇన్సూరెన్స్ లేని పక్షంలో – జర్మనీలో వైద్యపు ఖర్చు – మావంటి సామాన్యులకి అందుబాటులో ఉండదు.

మేమంతా గుప్తాని చూడ్డానికి హాస్పిటలుకి వెళ్లినపుడు అతను బాగానే ఉన్నాడు. నిజానికతనికి పెద్ద జబ్బేం చెయ్యలేదు. జలుబు కాస్త తీవ్రంగా వస్తే కంగారుపడ్డాడు. హాస్పిటల్లో చేరేక, మొదటిరోజు పరిస్థితి అంత బాగోలేదు కానీ మర్నాటినుంచీ అనారోగ్యం ఏమీ లేదుట. హాస్పిటల్ సదుపాయాలు ఎంత బాగున్నాయంటే అతనికింకా అక్కడే ఉండాలనిపిస్తోందిట. అందమైన నర్సులు చూపిన ఆదరణ కూడా అతనికి మరో ఆకర్షణ.

మనదేశంలో హాస్పిటల్సుకీ ఇక్కడి హాస్పిటల్సుకీ చాలా తేడా ఉంది. హాస్పిటల్లో ఉన్నన్ని రోజులూ సంతోషంగా కనబడ్డ గుప్తా ముఖంలో డిశ్చార్జ్అయ్యే రోజున దిగులు కనబడింది.

జర్మన్ భాష నేర్చుకోవడంలో ఈ గుప్తా సీరియస్‌గా ఉండేవాడు. అలవాట్ల విషయానికొస్తే – అతనిపై శర్మ ప్రభావం బాగా పడింది. ఆరంభంలోనే జబ్బు పడ్డాడేమో, ఇక శర్మనే గురువుగా స్వీకరించాడు. ఇండియాలో అతను శాకాహారి. జబ్బుపడ్డ మర్నాటినుంచీ మాంసాహారానికి మారిపోయాడు. మాంసాహారం చాలా రుచిగా ఉందనీ, ఇంతకాలం తనా రుచికి దూరం కావడం దురదృష్టమనీ వాపోయేవాడు.

"ఇండియాలో ఉండగా నాకు పాలు తాగడం ఇష్టముండేది కాదు. ఇక్కడ పాలు మరిగాను. కల్తీ లేకనేమో, ఇండియాలో నచ్చని అనేక శాకాహార పదార్థాలు నాకిక్కడ నచ్చుతున్నాయి. మాంసం కూడా ఇండియాలో కంటే ఇక్కడ రుచిగా ఉంటుందేమో! అందుకే గుప్తా మాంసాహారానికి మారిపోయాడు" అన్నాను నేను.

దీనికి నటరాజన్ ఒప్పుకోలేదు. జీవితంలో మాంసాహారం తినని వాళ్లకు ఇక్కడి మాంసాహారం నచ్చవచ్చునేమో కానీ, తనకు మాత్రం ఇండియాలో మాంసాహారమే బాగుండేదన్నాడు. ఇక్కడ మాంసాహారానికి రుచి, పచి లేదుట. మసాలాలు వేసి వండని మాంసం, వంటకమే కాదనేవాడతను.

తనకు దొరికిన శిష్యుణ్ణి శర్మ వదిలిపెట్టేవాడు కాదు. గిరీశం వెంకటేశాన్ని పట్టినట్లు, ఇరవైనాలుగు గంటలూ క్రంకెన్ గుప్తాను, కూడా తిప్పుకుంటూ ఎన్నో లెక్చర్లు ఇస్తూండేవాడు శర్మ.

గెసుండ్ గుప్తా విషయానికొస్తే అతడు పూర్తిగా భిన్నం. ఇండియా వదిలిపెడుతూనే పాశ్చాత్యుల్ని గురించి చాలా ఊహలతో, ఆశలతో వచ్చాడతను. జర్మనీలో అడుగు పెడుతూనే, "ఏరీ, అమ్మాయిలు కనిపించరేం? వైన్ గ్లాసులు అందించరేం?" అని హడావుడి పడ్డాడు.

అతనూ ఇండియాలో ఉండగా శాకాహారిట. మాటల సందర్భంలో ఓసారి నాతో, "ఇప్పుడు నాకు నరమాంసమైనా సరే అభ్యంతరం లేదు" అన్నాడు గొప్పగా.

అతనలా అనడానికి కారణం మాతో ఉన్న మిగతా ఇండియన్స్ఎవ్వరూ బీఫ్ (ఆవుమాంసం) తినకపోవడం.

గెసుండ్ గుప్తా స్వతహాగా మంచివాడు. ఎటొచ్చీ మాటతీరువ లేదు. వస్తూనే అందరితో గొడవ పడ్డాడు. అతని పద్ధతి నచ్చక చాలామంది అతన్ని వెలివేసినట్లు వదిలేశారు. జర్మనీ వచ్చి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారిపోయిన తనకు ఎవ్వరితో పడకపోవడమూ, ఏ మాత్రమూ మారకుండా ఇండియాలో ఎలా ఉన్నానో అలాగే ఉంటున్న నాతో అందరూ సఖ్యంగా ఉండడమూ అతనికి ఆశ్చర్యంగా ఉండేది.

అది మనసులో పెట్టుకున్నాడేమో, ఒకరోజు అతను నాతో కయ్యానికి కాలు దువ్వుతూ, "నువ్వు శాకాహారివి కదా – మరి పాలు తాగుతావా?" అనడిగాడు.

"ఊఁ" అన్నాను.

"జర్మనీలోనూ శాకాహారులున్నారు. కానీ జంతుసంబంధమని జర్మన్ శాకాహారులెవ్వరూ పాలు కూడా ముట్టరు" అన్నాడతను.

పాలు జంతు సంబంధమన్నది నిజం. జర్మనీలో పాలని శాకాహారంగా భావించనివారున్నారని కూడా నేను విన్నాను. "నువ్వన్నది నిజమే. కానీ నేను జర్మన్ని కాదు, ఇండియన్ శాకాహారిని" అన్నాను.

"ఆవుపాలు మనిషికోసం కాదు. ప్రకృతి వాటిని ఆవుదూడకోసం ఇచ్చింది. ఆ పాలని మనుషులు తాగాలనుకోవడం అన్యాయం. అదలాగుంచితే, ఈ దేశాల్లో పాలెలా తీస్తారో తెలుసా – మిషన్లతో! ఆ పద్ధతిలో హింస ఉంది. ఒకోసారి పొదుగునుంచి రక్తం కూడా వస్తుంది. పాలు తాగడమంటే అలాంటి హింసను ప్రోత్సహించడమే. అది మాంసాహారం తినడంకంటె వెయ్యి రెట్లు ఘోరం" అన్నాడు గెసుండ్ గుప్తా.

నేను కూల్‌గా నవ్వి, "మిస్టర్ గుప్తా! ముందు నాకో విషయం చెప్పు. మాంసాహారం తినడం ఘోరమని నీ అభిప్రాయమా?" అనడిగాను.

"కాదు. పాలు తాగేవాడు కూడా మాంసాహారి అని నా అభిప్రాయం" అన్నాడు గుప్తా.

"ఐతే నాకూ కొన్ని అభిప్రాయాలున్నాయి, విను. ఒకటి – మాంసం తినడం నేరమో, ఘోరమో కాదు. అది న్యాయబద్ధం. చాలామంది ఎంతో ఇష్టంగా తినే ఆహారం. రెండు – శాకాహారి అనిపించుకోవాలన్న కోరిక నాకు లేదు. నా ఆహారపు అలవాట్లగురించి నలుగురికీ అర్థం కావడం కోసం ఓ నిర్వచనాన్ని అనుసరిస్తూ, నన్ను నేను శాకాహారిగా చెప్పుకుంటున్నాను. మూడు – పాలు తాగుతున్న కారణంగా నువ్వు నన్ను మాంసాహారి అని పిలవదల్చుకుంటే నాకేవిధమైన అభ్యంతరమూ లేదు. నేను పాలు తాగుతూనే ఉంటాను. నువ్వు నన్ను మాంసాహారి అను. కానీ నువ్వు తినే మాంసం, నన్నూ తినమని బలవంతపెట్టకు" అన్నాను.

"నువ్వు చాలా మొండివాడివి" అన్నాడు గుప్తా. అన్నాడు కానీ అతను నాకంటే మొండివాడు. నా అలవాట్ల గురించి విమర్శించే అవకాశంకోసం కాచుకుని ఉండేవాడు.

జర్మనీ చలిదేశం కాబట్టి అక్కడ మద్యం తీసుకోవడం అత్యంతావశ్యకం – అని తరచుగా ఇండియన్స్ని ప్రబోధించేవాడు గుప్తా.

"ఇక్కడ తాగనివాళ్లం నేనూ, రావే కాబట్టి ఈ లెక్చర్ మా ఇద్దరి కోసమే అనుకోవాలి. మిగతావాళ్లంతా అంతో ఇంతో పుచ్చుకునేవాళ్లేగా!" అనేవాడు రామచంద్ర.

రామచంద్ర కూడా మద్యం పుచ్చుకోకపోవడంలో నా అంత ఖచ్చితంగానూ ఉండేవాడు. ఐతే మనసులో అతడికి మద్యం రుచి చూడాలని కోరిక ఉండేది. బొత్తిగా మద్యం జోలికి వెళ్లకపోవడంవల్ల నా గురించి అంతా విశేషంగా చెప్పుకుంటున్నారని అతడికి తెలుసు. తన గురించీ అలా ప్రత్యేకంగా చెప్పుకోవాలని అతడి కోరిక. కానీ తను కాఫీ, టీలు తాగడంవల్లనో ఏమో, మద్యం విషయంలో నాకొచ్చిన గుర్తింపు అతడికి రాలేదు. అందుకని అవకాశం వచ్చినప్పుడల్లా తననీ నన్నూ కలిపి చెప్పేవాడు.

"ఔను. నేను మీ మేలు కోరేవాణ్ణి. మీ ఇద్దర్నీ మార్చడమే నా లక్ష్యం" అన్నాడు గెసుండ్ గుప్తా. ఆ మాటకు కట్టుబడి, మేమంతా కలిసినప్పుడల్లా రోజూ ఒకసారి, చలిదేశాల్లో మద్యం ఆవశ్యకత గురించి ఉపన్యాసం ఇచ్చేవాడు. అంశమే కాదు, చెప్పే మాటలూ ఎప్పుడూ అవే కావడంవల్ల కొన్నాళ్లకి అది అందరికీ కంఠతా వచ్చేసింది. గుప్తా నోరు తెరవగానే ఎవరో ఒకరు ఆ ఉపన్యాసాన్ని తామే కొనసాగించి పూర్తి చేసేవారు.

"నన్ను చెప్పనివ్వండి" అన్నాడు గెసుండ్ గుప్తా ఒకరోజున.

"వద్దులే, వినడానికి కనీసం గొంతులోనైనా మార్పుండాలి" అన్నాను నేను.

అతని ముఖం ఎర్రబడింది. "ఇంతమందికి నా మాటలు కంఠతా వచ్చి ఏం లాభం, నీలో ఏ మార్పూ లేకపోయాక! ఇక ఇలా లాభం లేదు. రోజూ సాయంత్రాలు నీ గదికొచ్చి చెప్పడం మొదలెట్టాలి" అన్నాడు.

"నీకెందుకంత శ్రమ! ఇవి నాకూ కంఠతా వచ్చు. నా గదికెళ్లి నేనే చదువుకోగలను. ఎవరైనా చూసి ఏం చదువుతున్నావని అడిగితే గుప్తమంత్రమని చెబుతాన్లే" అన్నాను. అని ఊరుకోలేదు. అతనికి నమ్మకం కలిగించడానికి ఆ మాటలు నేనూ ఒకసారి చెప్పాను.

"గుడ్ జోక్" అని నవ్వేశాడు గెసుండ్ గుప్తా.

ఒకసారి అతనే నాకు చెప్పాడు. సెమినార్సులో ఎవరైనా కష్టమైన ప్రశ్న వేసినప్పుడు మనకి జవాబు తెలియకపోతే, "వెరీ గుడ్ క్వెశ్చన్" అని ముందరికాళ్లకి బంధమేసి తప్పించుకోవచ్చని. అలాగే నలుగురు కలిసి మాట్లాడుకుంటున్నప్పుడు తనమీదే జోక్ పడితే, "గుడ్ జోక్" అనడంతో టాపిక్ మారిపోతుందట.

ఏ మాటకామాటే చెప్పాలి. గెసుండ్ గుప్తాకి చాలా మంచి అలవాట్లున్నాయి. రోజూ ఉదయం వ్యాయామం చేసేవాడు. ఆ విషయం కూడా అడక్కుండా అందరికీ చెప్పేవాడు. మనిషి ఆరోగ్యంగా, బలంగా ఉండేవాడు. ఒకసారి మేము బిశ్వాస్ఇంటికి దగ్గర్లో ఉన్న వాల్డ్‌లో (అడవి) కాలిబాటలో నడుస్తున్నాం. అందులో వ్యాయామం చేసేవారికి సదుపాయాలున్నాయి. మేమంతా అక్కడ పులప్స్ తీస్తే, గెసుండ్ గుప్తా మాకంటే ఎక్కువ తియ్యడమే కాక, విన్యాసాలు కూడా చేశాడు. చూడ్డానికి ఎంత బాగుందంటే, అలా వెడుతున్న ఓ జర్మన్ వనిత అభినందన పూర్వకంగా చప్పట్లు కొట్టి వెళ్లింది.

గుప్తా ఆరోగ్యాన్ని మేమూ అభినందించేవాళ్లం. కానీ ఆ విశేషాన్ని కూడా మద్యపానానికే అంటగట్టే బలహీనత మాత్రం అతణ్ణి వదిలేది కాదు.

ఒకరోజు కొందరు మిత్రులం ఆరుబయట ప్రాంతాన నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నాం. వాతావరణం చల్లగానే ఉన్నా ఎండపొడి బాగా తెలుస్తోంది.

"ఇలాంటి ఎండలో ఇంత చలిగా ఉంటుందంటే ఇండియన్సుకి నమ్మడం కష్టం" అన్నాడు క్రంకెన్ గుప్తా అరచేతుల్ని రాపాడిస్తూ.

అప్పుడు గెసుండ్ గుప్తా అహహా అని నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతావు?" అన్నాడు బిశ్వాస్.

"వచ్చేముందే గుక్కెడు కోన్యాక్ (బ్రాందీ) పుచ్చుకున్నాను. అందువల్ల వళ్ళు ఎంతగా వెచ్చబడిందంటే స్వెటర్ తీసేసి వచ్చాను?" అంటూ క్రంకెన్ గుప్తాని చూసి, "గుక్కెడు కోన్యాక్‌తో సరిపోయేదానికి – ఇంత లావు స్వెటరు వేసుకుని పైగా చలి అంటుంటే నవ్వు రాదా మరి!" అన్నాడు.

ఆ తర్వాత ఒకొక్కరి దగ్గరకే వచ్చి, "ఎందుకీ స్వెటర్ బరువు వంటిమీద? నాకులా ఫ్రీగా తిరగొచ్చుగా. ఇలా ఎంత బాగుంటుందో – జస్ట్ గుక్కెడు కోన్యాక్ కీప్స్ ఎ స్వెటర్ ఎవే" అంటూ నాదగ్గరికొచ్చి ఆగిపోయాడు. నేను స్వెటర్ వేసుకోలేదు.

నిజానికారోజు బయట వాతావరణం ఆంధ్రాలో చలికాలంలా ఆహ్లాదకరంగా ఉంది. అలవాటైన ఉత్తరాదివాళ్లు వేసుకోవాలి తప్పితే, స్వెటర్ వేసుకుంటే ఉక్కపోసేలాగే ఉంది.

నేను గెసుండ్ గుప్తాతో, "బయల్దేరేముందు ఓ పావు లీటరు చల్లటి పాలు తాగి వచ్చాను. నేను ఉక్కగా ఫీలవడానికి కారణం అదవునోకాదో తెలియదు" అన్నాను.

అంతా నవ్వారు. గుప్తా "గుడ్ జోక్" అనకుండానే టాపిక్ మారింది.

గెసుండ్ గుప్తా తనకిష్టమైనట్లు తనుంటున్నాడు. నేను నాకిష్టమైనట్లు నేనుంటున్నాను. కానీ నాకున్న తృప్తి అతనికున్నట్లు లేదు. నేను తనకిలా ఉండడంలేదన్న అసంతృప్తి అతణ్ణి బాధిస్తోందని నాకు తెలుస్తూనే ఉండేది.

ఒకసారి అతను నాతో, "బాగా చదువుకున్నావు. సంస్కారమున్నవాడిలా కనబడుతున్నావు. ఈ దేశం వచ్చి ఈ దేశస్థుల అలవాట్లను నిరసించడం సభ్యత అనిపించుకుంటుందా?" అన్నాడు.

"నేను ఈదేశస్థుల అలవాట్లను నిరసించడంలేదు. నా అలవాట్లను నిలుపుకుంటున్నానంతే" అన్నాను.

"బీ ఎ రోమన్ ఇన్ రోమ్అన్న నానుడి నీకు తెలియదా?" అడిగాడు గుప్తా.

"ఎక్కడకు వెళ్లినా నీ వ్యక్తిత్వాన్ని నిలుపుకోమన్న నానుడి ఒకటుంది. నాకది ఇంకా ముఖ్యం!" అన్నాను.

"ఏం సాధిస్తావ్నీ అలవాట్లను నిలుపుకుని?" నిరసనగా అన్నాడు గుప్తా.

"చూడు మిస్టర్ గుప్తా! ఈ ప్రపంచంలో మంచిచెడ్డలు నిర్ణయించేది నేను కాదు. అందువల్ల నాకు లేని అలవాట్లను చెడ్డవని నేననను. నాకు మద్యమాంసాలపట్ల ఏమాత్రం ఆసక్తి లేదు. మద్యమాంసాలు ముఖ్యమనుకునే ఈ దేశంలో ఉండే అవకాశం నాకొచ్చింది. నీలాంటి వాళ్లందరూ ఇక్కడికొచ్చి, మీ ఇష్టంమీద మద్యమాంసాలు స్వీకరిస్తూ, అవి లేకుండా ఇక్కడ బ్రతకడం అసాధ్యమని ప్రచారం చేస్తున్నారు. అది నిజం కాదని నా నమ్మకం. ఇక్కణ్ణించి వెళ్లేలోగా ఒక్క కోడిగుడ్డయినా తినకుండా, చుక్క బీరైనా తాగకుండా ఉండగలిగితే – నా నమ్మకం ఋజువు చేసినవాణ్ణవుతాను. నాకదో తృప్తి" అన్నాను.

"పార్టీలకొచ్చి తాగకపోవడం తమకి అవమానంగా భావిస్తారు జర్మన్స్. నీలాంటివాళ్లను వాళ్లు మనసులో ఏవగించుకుంటారు తెలుసా?" అన్నాడు గుప్తా.

"అది నీకు నువ్విచ్చుకుంటున్న సంజాయిషీ. లేదా నాకు కలిగించాలనుకుంటున్న భ్రమ! ఏ సంస్కృతినైనా అర్థం చేసుకుని గౌరవించగల సంస్కారం ఇక్కడి వారికుందని నాకనిపిస్తోంది" అన్నాను.

ఏమనుకున్నాడో కొంతకాలంపాటు గుప్తా నన్ను తప్పించుకు తిరిగాడు. ఇండియాలో అస్పృశ్యతను సృష్టించిన బ్రాహ్మణుల కోవకు చెందినవాడినని నా గురించి అతనన్నట్లు తెలిసింది.

గెసుండ్ గుప్తాలాంటివాళ్లు జర్మనీలోనే కాదు, ఇండియాలోనూ చాలామందే తటస్థపడ్డారు నాకు. నా స్నేహితుల్లోనే చాలామందికి నా అలవాట్లు నచ్చేవి కాదు. రోజుకి పలుమార్లు టీ తాగడమే సంస్కృతిలో భాగం అనుకునే ఒరిస్సాలో, పదిమంది ఒకచోట కలిసినప్పుడు, నేనొక్కణ్ణే టీ తాగకపోవడం బాగా నిరసనకు గురయ్యేది. అయితే నా మానాన నేనుంటూ, ఇతరుల అలవాట్లను నిరసించకుండా స్నేహభావాన్ని మాత్రమే ప్రదర్శిస్తున్న నన్ను, వాళ్లు అర్థం చేసుకుందుకు ఎంతో కాలం పట్టలేదు. జర్మనీలోనూ అదే జరిగింది. గుప్తా నేనూ తొందరగానే బాగా దగ్గర స్నేహితులమయ్యాం!

మా బృందంలో రామచంద్ర ఇంకో తరహా. మనిషిలో చలాకీతనముంది కానీ దానికి కాస్త అమాయకత్వం కూడా జతపడింది. ప్రతీదీ తనకి తెలుసనుకునేవాడు. మిగతావాళ్లు కూడా అలా అనుకోవాలనుకునేవాడు. అందుకోసం ఎంతో కష్టపడి మా అందరికంటే ముందుగా చుట్టుపక్కల సమాచారం సేకరించి అందజేసేవాడు. ఇచ్చిన సమాచారంకంటే తన గురించి చెప్పుకునేదే ఎక్కువ కావడంవల్ల మిగతావాళ్లు అతనికి థాంక్స్ కూడా చెప్పేవాళ్లు కాదు. అతనికి కావాల్సింది మెప్పు. ఆ విషయం నాకు స్పష్టమైంది కాబట్టి, అతన్ని మెచ్చుకోవడంవల్ల నాకొచ్చే నష్టం ఏంలేదు కాబట్టి – నేనతన్ని తెగ పొగిడేవాణ్ణి. నిజం చెప్పొద్దూ, అప్పుడతని కళ్లలోని మెరుపుని చూస్తే, అతన్నింకా ఇంకా పొగడాలనిపించేది. పొగిడేవాణ్ణి. దాంతో రామచంద్ర నాతోనే ఎక్కువగా తిరిగేవాడు. తన సామర్థ్యం గురించి అదే పనిగా చెప్పుకునే అతని కబుర్లు నాకు వినోదాన్నిచ్చేవి.

సుబ్రహ్మణ్యం మాత్రం రామచంద్రని బోరు అనేవాడు. స్వంత డబ్బానతను భరించలేడట.

రామచంద్ర పొదుపరి. అతనికి ఇంట్లో వంట చేసుకుందుకు అనుమతి ఉంది. తను వంటలు బాగా చేస్తానని అతనే చెప్పాడు. అందుకని అతను మాతో హోటలుకొచ్చి భోంచేసేవాడు కాదు. నెలనెలా వచ్చే ఇరవై మీల్స్ టికెట్లనూ, అతను ఇన్‌స్టిట్యూట్లో ఇచ్చేసి ప్రతిఫలంగా తొంభై మార్కులు పుచ్చుకునేవాడు. ఇంటివద్ద వండుకుంటే అతనికి నెలకి ముప్పై మార్కులలోపే ఔతోందిట.

అతనలా చెబితే మిగతావాళ్లు వేళాకోళంగా నవ్వేవారు. రామచంద్ర చిన్నబుచ్చుకునేవాడు కాదు. ఓపికగా ఖర్చుల వివరాలిచ్చేవాడు. అవి నేను తప్ప ఎవ్వరూ వినేవారు కాదు. ఇక్కడైతే నాకు వంటకి సదుపాయం లేదు కానీ బెర్లిన్ వెడితే, వంట సదుపాయమున్న ఇల్లే వెతుక్కోదల్చుకున్నాను కాబట్టి – ఆ వివరాలు నాకు కుతూహలంగానే ఉండేవి.

ఒకసారి రామచంద్ర సంతలో పాతిక నిమ్మకాయలు, ఎండు మిరపకాయల కారం కొన్నాడు. దుకాణంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ కొన్నాడు. ఒకరోజు మాలో కొందర్ని భోజనానికి పిలిచి – మాముందే ఆ నిమ్మకాయలు కోసి ఊరగాయ పెట్టాడు. నాకు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

నిమ్మకాయ ఊరగాయ పెడుతున్నప్పుడు నిమ్మరసం కొంచెం ఉండిపోయింది. ఆ రసాన్ని కొంచెం లెమన్ బాత్‌కీ, కొంచెం సాంబారుకీ ఉపయోగించాడు. అతను చేస్తున్న పద్ధతి చూస్తుంటే – వంట ఎంత సులభమో అనిపించింది.

అతను చేసినవన్నీ బాగున్నాయి. కానీ లెమన్బాత్ పులిహోరలా ఉండి – ప్రాణం లేచి వచ్చినట్లయింది. జర్మనీలో ఇటువంటి వంటకాలు చేసుకునే అవకాశముందని తెలిసి నాకు చాలా సంతోషమైంది. తర్వాత రామచంద్ర, వచ్చిన ఇండియన్సులో వంట సదుపాయం ఉన్నవారికి తలో కాస్తా ఊరగాయ ఇచ్చాడు.

రామచంద్రకు తన గురించి చెప్పుకునే అలవాటుంటే ఉండొచ్చు. కానీ అతనివల్లనే చాలామందికి కొన్ని ఉపయుక్త విశేషాలు తెలిశాయి. ఇండియాలో దొరికే అనేక వంట దినుసులకి జర్మన్ పేర్లను తెలుసుకున్నాడు. ఉప్మాకు వాడే బొంబాయి రవ్వలాంటి దినుసు 'గ్రీస్' పేరిట చాలా షాపుల్లో దొరుకుతుందని అతనే చెప్పాడు. అన్నింటికీ మించి – 'ఆల్‌బ్రెస్ట్' అనే చౌకధరల దుకాణం గురించి మాకు అతనివల్లనే తెలిసింది. ఎందువల్లనో తెలియదు కానీ మిగతాచోట్లతో పోల్చితే ఆ దుకాణంలో అన్ని దినుసుల ధరలూ చాలా తక్కువ. మిగతా షాపుల్లో బియ్యం అరకిలో ప్యాకెట్ ఒకటిన్నర మార్కులుంటే, అక్కడ మాత్రం ఎనభైఎనిమిది ఫెనిగ్స్. బ్రెడ్ మిగతా చోట్ల కనీసం ఒక మార్కుంటే – అక్కడ యాభైతొమ్మిది ఫెనిగ్స్. పాలు, బొంబాయిరవ్వ వగైరాలన్నీ అక్కడ బాగా చౌక. ఈ 'ఆల్‌బ్రెస్ట్' చెయిన్ షాపులు సాధారణంగా ప్రతి ఊళ్లోనూ ఉంటాయిట. వీటిలో ముఖ్యంగా తిండి సామగ్రి మాత్రమే దొరుకుతుంది. ఈ దుకాణం మా తిండి ఖర్చులో కనీసం ముప్పైఐదు శాతం తగ్గించగలదు.

ఇలాంటి సమాచారం ఎంతో ముఖ్యమైనదే కదా! అందుకని రామచంద్ర మిత్రబృందం నుంచి అభినందన లాశించేవాడు. మిగతావాళ్లు వినడమే గొప్పన్నట్లు ప్రవర్తించేవారు. అవసరమైనప్పుడు మాకు మేమే తెలుసుకోగలమన్నట్లు మాట్లాడేవారు. ఇక్కడికొచ్చింది, వంటల్లో పొదుపుకా అని ఈసడించేవారూ ఉన్నారు. నేను మాత్రం మనస్ఫూర్తిగా అతన్ని మెచ్చుకునేవాణ్ణి. అది స్నేహధర్మం మాత్రమే కాదు. బెర్లిన్ వెళ్లేక కూడా, అతనిచ్చిన సమాచారంవల్ల ప్రయోజనం పొందుతూ, మనసులో తరచుగా అతన్ని మెచ్చుకునేవాణ్ణి. ఒకోసారి మెచ్చుకుంటూ ఉత్తరాలు కూడా వ్రాసేవాణ్ణి. అప్పుడు అతన్నించి మరింత కొత్త సమాచారంతో జవాబొచ్చేది. నాలుగు పంక్తుల సమాచారంలో, నలభై పంక్తులు – అది సంపాదించడానికి ఉపయోగపడ్డ తన ప్రతిభ గురించి ఉండేది. మిగతావారు అతని గురించి అనుకునేది తెలిసినవాణ్ణి కాబట్టి – ఆ నలభై పంక్తుల్లోనూ నాకు అతని అమాయకత్వమే కనిపించి జాలి పుట్టేది.

రామచంద్రకి వితరణ ఉంది. అక్కడ గిఫ్ట్స్ ఇవ్వడానికని అతను ఇండియానుంచి చందనం ఐటమ్స్ వగైరాలు చాలా తెచ్చుకున్నాడు. అలాంటివి ఆట్టే తెచ్చుకోలేదని వాటిలో కొన్ని నాకూ, నటరాజన్‌కీ ఇచ్చాడు. మరి నీకు తగ్గిపోవా అని తీసుకుందుకు తటపటాయించాను. "నా సంగతి తెలుసుగా, మరిన్ని తెప్పించుకునే సోర్సెస్ పట్టాను" అంటూ తన గురించి మళ్ళీ మొదలెట్టాడు.

అప్పుడతను చేసిన సాయంముందు ఆ స్వోత్కర్ష ఏపాటిది? నాకు రామచంద్ర ఆ వస్తువులివ్వడం అపూర్వంగా అనిపించింది. వాటిలో ఒక చందనం బాల్‌పెన్, తాళాలగుత్తి ఫ్రౌ యాకేల్‌కి ఇచ్చాను. గురివిందంత చిన్న గింజను దొలిచి అందులో ఉంచిన బోలెడు జంతువుల బొమ్మలు (ఇవి మైక్రోస్కోపుతో చూస్తేనే కనబడతాయి) – ఆమె మనవడికని ఇచ్చాను. ఆమె ఎంత సంబరపడిందో చెప్పలేను. థాంక్స్ టు రామచంద్ర!

ఒకసారి ఇండియన్స్ అంతా గ్యోతే ఇన్‌స్టిట్యూట్లో భారీ ఎత్తున విందు చేసుకున్నాం. దానికి మా జర్మన్ టీచర్ని కూడా పిలిచాం. లెమన్ బాత్, సాంబారు, పాయసం – పూర్తిగా రామచంద్ర అజమాయిషీలో తయారయ్యాయి. పూరీ, కూర ఉత్తరాదివారు చేశారు. ఒత్తడానికి బీర్ బాటిల్స్ ఉపయోగించాం. వంటకాలు అందరి మెప్పు పొందాయి.

మాకు శని, ఆదివారాలు సెలవు కాబట్టి ఆ రోజుల్లో నా బోటిగాళ్ళు ఒకరిద్దర్ని తరచుగా భోజనానికి పిలవాలనుకున్నాడు రామచంద్ర. ఐతే ఇంటికి తరచుగా అతిథులు రావడం అతని ల్యాండ్‌లేడీకి ఇష్టముండదు. అందువల్ల ఆ ప్రయత్నం విరమించుకోవలసి వచ్చింది.

అడపాతడపా పిక్నిక్స్ వేసుకునేవాళ్ళం. ఏ పిక్నిక్కి వెళ్లినా రామచంద్ర ముందుండి అందర్నీ గైడ్ చేయాలని ప్రయత్నించేవాడు. చాలామంది అతన్ని డైరెక్టర్ అనేవారు. అది అభినందన కాదు, హేళన. అతను మాత్రం అభినందనగా భావించి తెగ మురిసేవాడు.

మహారాష్ట్రనుంచి వచ్చిన దేవదార్ నాకు మరో మంచిమిత్రుడు. అందరితో చటుక్కున కలవలేడు కానీ బాగా ఆత్మవిశ్వాసమున్నవాడు. హుందాగా వ్యవహరిస్తాడు. చాలా విషయాల్లో నావీ అతడివీ అభిరుచులు కలిశాయి. కానీ కొన్ని విశేషాలకు అతను ఇట్టే ఎక్సయిటవుతూ అమాయకుడనిపిస్తాడు. మచ్చుకి – కొత్తగా డైరీ రాస్తున్నాననీ, ప్రతి పైసకీ అకౌంట్ వెయ్యడం మొదలెట్టాననీ, అది చాలా గొప్ప అనుభవమనీ నాకు చెప్పాడోసారి. నేనైతే 1958నుంచీ ఆ పని చేస్తున్నాను. కానీ అతనెంతో గొప్పగా ఫీలౌతున్నాడని గ్రహించి, అభినందించి ఊరుకున్నాను.

నేను తరచుగా శ్రీమతి, పిల్లల గురించి తల్చుకోవడం చూసి, "నీకు వాళ్ళే జీవితంలా ఉందే!" అన్నాడతను.

"నాకే కాదు, వివాహితులెవరికైనా అలాగే ఉంటుంది" అంటూ భార్యాబిడ్డలకి సంబంధించిన కొన్ని మనోహర ఘటనల్ని చెప్పాను. దేవదార్ వెంటనే దాపరికం లేకుండా – తనకి పెళ్లి చేసుకోవాలనుందనీ, తలిదండ్రులు శ్రద్ధపట్టడం లేదనీ వాపోయాడు. ఆ సమయంలో నా పక్కనే ఉన్న రామచంద్ర, "మావాళ్ళూ నా పెళ్లి గురించి శ్రద్ధ పట్టలేదు. వాళ్ల పీకెలమీద కూర్చుని జరిపించుకున్నాను" అంటూ మనిషికి దాంపత్యజీవితం ఎంత అవసరమో, అదెంత మనోహరంగా ఉంటుందో పెద్ద ఉపన్యాసమిచ్చాడు.

దేవదార్ మౌనంగా విని, "నీకు పెళ్లయి ఎన్నేళ్లయింది" అన్నాడు.

నాకు అర్థమైంది కానీ రామచంద్ర మాత్రం, "ఏళ్లేం కాదు, జర్మనీ వచ్చేముందే అయింది. ఆ కాస్త సమయం లోనే మా ఇద్దరికీ వెయ్యిజన్మల అనుబంధం ఏర్పడింది" అంటూ ప్రేమకీ, పెళ్లికీ తేడా చెప్పడం మొదలెట్టాడు.

దేవదార్‌కి వంట సదుపాయముంది. అప్పుడప్పుడు నన్ను తనింటికి పిల్చి సాంబారు తయారు చేసేవాడు. రామచంద్ర అంత గొప్పగా కాకపోయినా, అతని వంటలు కూడా బాగుండేవి. ఆపైన అతడికి సాహిత్యంపట్ల ఆసక్తి ఉంది. అతనొకసారి మహాభారతంలో ద్రోణాచార్యుడి కుమారుడు అశ్వత్థామపై వచ్చిన ఓ మరాఠీ కవిత సారాంశం చెప్పాడు. ద్రోణుడి ఆదాయం చాలక, తల్లి అశ్వత్థామకి నీళ్లలో మైదా కలిపి, అవే పాలని చెప్పి ఇచ్చేదిట. ఒకసారి అశ్వత్థామ దుర్యోధనుడి ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ వాళ్ళిచ్చిన పాలు తాగి ఇంటికొచ్చి ఆ విషయం తల్లికి చెప్పాట్ట. "అమ్మా, నేను పాలుతాగేను" అని ప్రారంభమైన ఆ కవితలో ఆ ఇంటి పాలకూ, తనింటి పాలకూ ఉన్న తేడాని కవి ఎంత హృద్యంగా

వర్ణించాడో కానీ, దేవదార్ చెప్పిన తీరు నాకు కళ్ళనీళ్లు తెప్పించింది. ఆ కవిత ఎంత నచ్చిందంటే, ఆ తర్వాతెప్పుడో దాన్ని మా 'అమ్మ' నవల్లో ఉదహరించాను.

మా బృందంలో నాకు దగ్గర మిత్రుడు నటరాజన్. ఇద్దరం కెమిస్ట్రీ వాళ్లమే కావడం, చాలా విషయాల్లో మా అభిప్రాయాలు ఒకటే కావడం, మమ్మల్ని మరీ దగ్గర చేశాయి. నటరాజన్ వయసులో నాకంటే కొంచెం పెద్దవాడు. కానీ ఇంకా పెళ్లి కాలేదు. మనసులోని మాట నిర్మొహమాటంగా పైకి అనేసేవాడు. తను చెప్పింది తప్పైతే వెంటనే ఒప్పేసుకునేవాడు. అలాంటి వాళ్లంటే నాకు చాలా ఇష్టం. నాకులాగే అతనికీ సినిమా పాటల పిచ్చి ఉంది. ఇండియానుంచి ఒక పెద్ద స్పూల్ టేపునిండా హిందీ సినిమా పాటలు రికార్డు చేసుకుని వచ్చాడు. ఇండియాలో అతనికి స్పూల్ టైపు టేపురికార్డరు ఉందిట.

జర్మనీలో అడుగు పెట్టిన పదమూడు రోజుల్లోనే నేను రేడియో-కమ్-టేపు రికార్డరు కొన్నాను. అలాంటివప్పుడు కొత్తగా మార్కెట్లోకి వస్తున్నాయి. దాని ఖరీదు మూడువందలపాతిక మార్కులు. అంత తక్కువ వ్యవధిలో అంత ఖర్చు పెట్టడానికి చాలా ధైర్యం అవసరమని మిగతా ఇండియన్సుని చూసేక అనిపించింది. కానీ నా తొందరకి కారణముంది.

నేను జర్మనీకి బయల్దేరేముందు, భువనేశ్వర్లో ప్రసాద్ అనే నా సీనియర్ కొలీగ్, మా పిల్లల మాటలు, పాటలు రికార్డు చేసి, ఆ కాసెట్ నాకిచ్చాడు. అది వినే అవకాశం ఎప్పుడెప్పుడా అని తహతహలాడిపోతున్నాను. అదే నాకు ధైర్యాన్నిచ్చింది.

అక్కడి మిత్రుల్లో నటరాజన్ నాకు ప్రత్యేకం. ప్రతి ఆదివారం మేమిద్దరం కలుసుకోవాలనేవాడు. తనింట్లో వంట సదుపాయముంది కాబట్టి, నన్నక్కడికి రమ్మని బలవంతపెట్టేవాడు. తన హౌస్‌ఫ్రౌ చాలా మంచిదిట. అతనింటికి వచ్చే అతిథుల విషయమై ఆమె నియమాలేం విధించలేదు.

రేడియో రికార్డరు కొన్నాక – ప్రతి ఆదివారం నన్నది తీసుకుని రమ్మనేవాడు నటరాజన్. అతను స్పూల్ టేపులో ఇండియానుంచి తెచ్చుకున్న పాటల్ని క్యాసెట్లలోకి మార్చడానికి అవసరమైన సరంజామా, అతని హౌస్‌ఫ్రౌ సరఫరా చేసింది. అలా ఆ పాటలు నా రేడియో రికార్డరులో వినడానికి అనువయింది.

మేమిద్దరం ఆ పాటలు వింటూ ఆనందించేవాళ్లం. అతను తెచ్చిన పాటలన్నీ నాకు ఇష్టమైనవే! ముఖ్యంగా బాబీ చిత్రంలోని నరేంద్ర చంచల్ పాడిన 'బేషక్ మందిర్' పాట నన్నేదో లోకాలకు తీసుకుపోయేది.

ఏదో అవసరార్థం చేసుకుంటున్నాడు కానీ నటరాజన్‌కి పెద్దగా వంటలు రావు. వంట చెయ్యాలన్న అభిరుచి కూడా లేదు. నాకోసమని అతను ఒకరోజు ఉప్మా, ఒకరోజు అన్నం, బంగాళాదుంపల కూర – ఇలా మార్చి మార్చి చేస్తుండేవాడు. వంటలకు ఆవాల పోపు మంచి రుచి ఇస్తుందని ఎవరో చెబితే, ఒకసారి అతను ఆవాలు బాగా ఎక్కువ వేసి ఉప్మా చేశాడు. ఆవాలు ఎంత ఎక్కువయ్యాయంటే, ఆవాల ఉప్మాలో పోపుగా బొంబాయిరవ్వ వేసినట్లుంది. చిత్రమేమిటంటే అలా కూడా ఆ ఉప్మా తినడానికి బాగానే ఉంది. ఆత్మీయభావం కూడా వంటకాల రుచికి కారణమౌతుందని అప్పుడు నేను గ్రహించాను. అలాగని ఆత్మీయతనే వంటకం చేస్తే ఎల్లకాలం బాగుండదని అతనికి తెలుసు. ఆ తర్వాత ఆవాల వాడకంలో బాగా నియంత్రణ పాటించేవాడు.

నటరాజన్‌కి నా మనస్తత్వం బాగా అర్థమైంది. నాకు మొహమాటమెక్కువని, వంటకాల రుచిని నిర్ణయించడానికి నా సాయం తీసుకునేవాడు కాదు. 'ఉప్పెక్కువైనా బాగుందంటావ్ తప్ప, అసలు మాట చెప్పవు' అంటూ తనే ముందు రుచి చూసేవాడు. తరచుగా రావడానికి నేను మొహమాట పడుతున్నానని అతనికి అనుమానం. అందుకని శని, ఆదివారాల్లో నా కంపెనీ లేకపోతే – ఇండియాకి తిరిగి వెళ్లిపోయేవాణ్ణని నమ్మించడానికి తంటాలు పడేవాడు. నేను బొంబాయిరవ్వ, బియ్యం వగైరాలు కొని తీసుకెళ్లి అతనింట వదిలితే నొచ్చుకునేవాడు. రావడం కాస్త ఆలస్యమైతే కంగారుపడేవాడు. అక్కడున్న నాలుగు నెలల్లోనూ ఇద్దరం బాగా ఆత్మీయులమయ్యాం.

నటరాజన్ ఉండే ఇంటికి దగ్గర్లో దట్టమైన అడవి ఒకటుంది. మేము అప్పుడప్పుడు అందులో విహారానికి వెళ్లి వస్తూండేవాళ్లం. ఆ అడవిలో చక్కని కాలిబాట, మధ్యమధ్యలో వ్యాయామం చేసుకునేందుకు సదుపాయాలు ఉన్నాయి. ఆ అడవి ప్రత్యేకత ఏమిటంటే – పురుగూ, పుట్రా భయం లేదు.

నా రికార్డర్ నచ్చి అలాంటిదే తనూ ఒకటి కొన్నాడు నటరాజన్. రెండు రికార్డర్లూ పెట్టుకుని మిగతా ఇండియన్సు ఎందరికో పాటలు రికార్డింగ్ చేసిపెట్టేవాళ్లం. ఈ రికార్డింగ్ వల్ల నటరాజన్ ఇల్లు సెలవురోజుల్లో రద్దీగా ఉండేది. అక్కడికొచ్చేవాళ్లలో ఇక్బాల్, తెలుగు జోసెఫ్ నాకు బాగా గుర్తుండిపోయారు.

ఇక్బాల్ పాకిస్తానీ. అతనికి కంటిచూపు సమస్య ఉంది. కొంతకాలానికి పూర్తిగా చూపు పోతుందిట. ఈ విషయంలో అప్పటివరకూ విజ్ఞానం సాధించిన ప్రగతి అతనికి అక్కరకు రాదుట. ఈ ప్రపంచపు అందాల్ని కళ్లారా చూసే అవకాశం తనకి ఎంతోకాలం లేదనీ, కొద్దినెలల్లో అంధుడినైపోతాననీ అనేవాడతను. మనసేదోలా ఐపోయేది. హృషీకేష్ ముఖర్జీ తీసిన ఆనంద్ సినిమాలో రాజేష్‌ఖన్నా గుర్తుకొచ్చాడు. మా ఇద్దరికీ కామన్ టాపిక్ హిందీ పాటలు. 1955 తర్వాతనుంచి అప్పటివరకూ వచ్చిన హిట్ సినిమా పాటలన్నీ ఇంచుమించుగా నాకు తెలుసు. మేము కబుర్లకు కూర్చుంటే ఉత్సాహంలో సమయం తెలిసేది కాదు. జర్మనీలో ఉన్నందువల్లనేమో – అతను పాకిస్తానీ, నేను ఇండియన్ అన్న భావనే మాలో ఉండేది కాదు. మనిషిని పౌరసత్వంతో ముడి పెట్టకుండా – అభిరుచులకే ప్రాధాన్యమిస్తే ఎంత బాగుంటుందో అనిపింపజేసింది అతని పరిచయం. ఇక్బాల్‌కి నేను చాలా కాసెట్లు రికార్డు చేసిచ్చాను. తర్వాత అతను కూడా నా రేడియో–రికార్డరు లాంటిది ఒకటి కొన్నాడు.

తెలుగు జోసెఫ్ లాంగ్వేజ్ కోర్సు రెండవ విభాగంలో వచ్చాడు. ఇండియాలోని ఓ క్రైస్తవ సంస్థ పనుపున వచ్చిన ఇద్దరు జోసెఫ్‌లలో ఇతను తెలుగువాడు. రెండో జోసెఫ్‌ది కేరళ. కేరళ జోసెఫ్ఎక్కువగా ఉత్తరాదివారితో తిరిగితే, తెలుగు జోసెఫ్ నాతో ఎక్కువగా తిరిగేవాడు. పాటల విషయంలో మా ఇద్దరి అభిరుచులూ దగ్గర్లో ఉండడం అందుకు కారణం. రికార్డింగుకోసం అతను నటరాజన్ ఇంటికి తరచుగానే వచ్చేవాడు. కేరళ జోసెఫ్ కొంచెం అమాయకుడు. ఉత్తరాదివారు అతనిమీద చాలా జోక్సు వేసేవారు. నవ్వేవాడు తప్పితే నొచ్చుకునేవాడు కాదు.

ల్యూనబర్గ్‌లో గుర్తుండిపోయిన మరో వ్యక్తి చక్రవర్తి. అతను బిశ్వాస్‌కి అంకుల్ ఔతాట్ట. జర్మన్ వనితను పెళ్లాడి ల్యూనబర్గులో స్థిరపడ్డాడు. బిశ్వాస్ అతనింటికి ఒకటి రెండుసార్లు వెళ్లాడు కానీ, ఎందుకో అతడి గురించి మంచిగా చెప్పలేదు. ఒకసారి రోడ్డుమీద మా బృందానికి ఎదురుపడితే మాకు పరిచయం చేశాడు. అప్పుడు చక్రవర్తి తనింటికి రమ్మంటే తర్వాత వస్తానన్నాం.

ఒకసారి నేను, దేవదార్, రామచంద్ర అమ్ శాండే దగ్గర తిరుగుతుండగా చక్రవర్తి ఎదురుపడి బలవంతాన తనింటికి తీసుకెళ్లాడు. ఇంట్లో డ్రాయింగ్ రూం సినిమా సెట్టింగులా చాలా బాగుంది. అతనింట్లో బాగా ఖరీదైన సాఫిస్టికేటెడ్ ఆటోమేటిక్ స్టీరియో రికార్డర్ సిస్టం నన్ను బాగా ఆకర్షించింది. అలాంటిది ఎప్పటికైనా కొనగలనా అనుకున్నాను. అతని దగ్గర మంచి రికార్డ్స్ కలెక్షన్ఉంది. చూపించాడు. 'పటాస్కర్'దంటూ ఓ రికార్డు వినిపించాడు. ఆ సిస్టంలో ఎవరి పాటైనా వాయిద్యమైనా అద్భుతంగా ఉంటుందనిపించింది. థియేటర్లో సంగీతం విన్న అనుభూతి కలిగింది.

అతను మాకు విస్కీ, బ్రాందీ సెర్వ్ చేస్తే – ముగ్గురమూ వద్దన్నాం. అతని భార్య నాకు ఆరేంజ్ జ్యూస్, మిగతా ఇద్దరికీ టీ ఇచ్చి ఇండియన్ స్టైల్లో ఆదరించింది. చక్రవర్తి తను మాత్రం విస్కీ తీసుకుంటూ, "మధ్యతరగతి ఇండియన్సుకి ఇంట్లో ఇలా మందు పుచ్చుకునే అవకాశం – ఆశ్చర్యంగా అనిపిస్తుంది కదూ!" అన్నాడు.

విదేశాల్లో స్థిరపడ్డ ఇండియన్సుకి – తాము మామూలుగా ఇండియన్సుకి అందని వైభోగాలు అనుభవిస్తున్నామని చెప్పుకోవాలనుండేది అప్పట్లో.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments